

# మాటా మంతీ

-సాయి పద్మ



## 17

## లైఫో'సక్షన్

హలో.. లైపోసక్షన్ కాదండీ. గాభరా పడ్డారా? ఈ మధ్య లైఫో'సక్షన్ అని నేనో కథ రాసేను. చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. కొంతమంది, అధిక బరువు వల్ల ఎన్ని ఇబ్బందులు పడ్డారో కాల్ చేసి చెప్పారు. చెప్పినవాళ్ళు చాలా మంది ఆడవాళ్లే. కథ మీద రెస్పాన్స్ కూడా మళ్ళీ నన్ను ఆలోచనలో పడేసింది. జీరో సైజ్' నుండీ వినాయకుడి సినిమా వరకూ బరువు మీద వచ్చిన సినిమాలు అన్నీ నన్ను మళ్ళీ ఆలోచనల్లో పడేశాయి. బరువు కూడా మళ్ళీ ఆడవాళ్లకే బరువు, చాలావరకూ నా మాటలు ఫెమినిస్ట్ లా వినిపించినా ..!

నేను రాసిన కథ.. రకరకాల కారణాల వల్ల, జీవితాన్ని కుదించుకొని, కత్తిరించుకుంటున్న ఆడవాళ్ళ గురించి. చాలావరకూ.. ఒబేసిటీ జెండర్ ప్రోబ్లం కాదు. దాని వల్ల ఇబ్బందులు అందరికీ వొకేలా ఉంటాయి. ఒక్కసారి ఒబేసిటీ వల్ల వచ్చిన మార్కెట్, దాని ఫలితాలు కూడా ఆలోచిస్తే.. ఇది వొక జెండర్ ప్రోబ్లం లా ఎందుకు తయారయింది అంటే.. ఆరోగ్యం కంటే, బయటవాళ్లకి మనం ఎలా కనబడుతున్నాం ? అనే దానిపై ఈ మార్కెట్ అంతా ఆధారపడి ఉంది.

ఆ మధ్య నేను వొకసారి వీల్చైర్ లో నుంచి పడిపోయాను. చాలా చిన్న మోకాలి దెబ్బ తగిలింది. నెప్పి మాత్రం నెలలు పీడించింది. వొక ప్రఖ్యాత డాక్టర్ ( మా వూళ్ళో) చెప్పారు..

“మేడం.. మీకు మోకాలు కొంచం అరిగింది.. రిప్లేస్ చేయొచ్చు...”

నా జీవితంలో అంతకంటే, పెద్ద జోక్ వినలేదు. పోలియో తో ఎఫెక్ట్ అయి, నేను నా కాళ్ళ మీద నిలబడిందే లేదు. వొక దెబ్బకి, కాస్త అరిగిన మోకాళ్ళు మారిస్తే ఈ లెక్కన ఎన్ని మార్చాలి ? ఇలాగే మనం ప్రభావితం అవుతామా ? నెప్పి తగ్గాలనో, లేదా మన ప్రయత్నం లేని క్విక్ ఫిక్స్ లాంటి పరిపూర్ణ ఆరోగ్యం మన సొంతం కావాలని? నాకే మోకాళ్ళు మార్చమని సలహా ఇచ్చిన డాక్టర్ గారు, కాస్త నడుస్తూఉన్న వాళ్ళు, ముసలి వాళ్ళు వెళితే, ఎంత త్వరగా ఈ సలహా ఇస్తారో అనుకుంటే భయం వేసింది.

ఆలోచిస్తే, విచిత్రంగా లేదూ? మన తరానికి ముందు తరం పోలిస్తే, వాళ్ళ జీవితకాలంలో వాళ్ళు ఎంత శాతం హాస్పిటల్స్ లో గడిపి ఉంటారు ? ఎన్ని ఆపరేషన్లు గానీ, కరక్షన్స్ గానీ చేయించుకుంటారు ? ఇప్పుడు పళ్ళ దగ్గరనుండీ, కళ్ళ దాకా.. మొత్తం కరక్షన్సే. ఎందుకు మనల్ని మనం మనలాగే ఎక్సేప్ట్ చేయటం లేదు? ఇక్కడ నేను, తప్పనిసరై చేయాల్సిన ఆపరేషన్ల గురించి, ప్రోసీజర్ల గురించి మాట్లాడటం లేదు.

మనల్ని మనం, మన ఆలోచనా విధానాల్ని కత్తిరించుకున్న విధానం గురించి, అసలు ఆలోచనే లేని వొక ప్రమాదకరమైన జీవితం గురించి మాట్లాడుతున్నాను.

బోన్సాయి పద్ధతి, అందులో పెంచిన చెట్లు చూడటానికి వొక డ్రాయింగ్ రూమ్ లో ఎంత అందంగానో కనిపిస్తాయి కదా.. నాకు బోన్సాయిని చూస్తే, దీన్ని ఎన్ని సార్లు కత్తిరించి ఈ వయ్యారాలు పోవటానికి ఎన్ని బ్రేసింగ్స్/ వైరింగ్స్ పెట్టి ఉంటారో కదా అనిపిస్తుంది.

ఫేషన్ టీవీ చూస్తాం. మోడల్స్ రకరకాల డ్రెస్సెస్ వేసుకొని నడుస్తూ ఉంటారు. ఎంతమంది, ముఖ కళవళికలు, వాళ్ళకే ప్రత్యేకమైన కదలికలు మనకి కనిపిస్తాయి? చానెల్ ఆపిన తర్వాత ఎంతమంది అమ్మాయిలు లేదా అబ్బాయిలు మనకి గుర్తు ఉంటారు ? అలాంటి సమూహంలో వొక నీటి బొట్టు కావాలని, మనకే ప్రత్యకమైన ఐడెంటిటీని, జన్యుపరంగా మనకి సంక్రమించిన శరీరాన్ని ఎందుకు అంత చేక్కుకోవాలి ?

ఉదయం లేచిన దగ్గరనుండీ, ఏదో వొకటి మన శరీరాన్ని, మనసుని, మెదడుని ప్రభావితం చేస్తూనే ఉంటుంది. ఈ ఇంఫ్ల్యూఎన్స్ ని లోపలికి పంపిస్తూ ఉంటె, లోపల ఉన్న జీవశక్తి ని జీవించే దెపుడు ? మన ప్రత్యేకతలని మనం కనిపెట్టే దెపుడు..?

ఆలోచించండి.. విభేదించండి.. మీలా మీరు ఉండండి.. ఏ రకమైన భ్రమలకీ లోబడి, లేదా వత్తిళ్ళకి తలొగ్గి, మిమ్మల్ని, మీ ఆరోగ్యాన్ని, జీవితాన్ని కత్తిరించుకోకండి..!

ఆలోచిస్తారు కదూ ..!

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments